తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-25- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 207 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# నేనున్నంత కాలం.. నీకు అధికారం కలే

## రాష్ట్రంలో బీఆర్ఎస్, కేసిఆర్ ఇక గత చరిత్రే

కేసీఆర్‌వి సోయిలేని మాటలు..
స్థాయిలేని విమర్శలు
వరుస ఓటములు ఎదురయినా సిగ్గురాలేదా
నన్నూ..నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినా
పట్టించుకోలే
కేసులు పెట్టి జైలుకు తోసినా లాభం లేదని
మిన్నకున్నా
ఫామ్‌హౌజ్‌నే జైలుగా మార్చుకుని
ఉంటున్నావని గుర్తుంచుకో
సొంత చెల్లిని మెడబట్టి గెంటిన కేటీఆర్
నాపై విమర్శలా
నీలాంటి వారిని చాలామందిని చూసా..గుర్తుంచుకో
కిందిస్థాయి నుంచి వచ్చి సీఎంగా అయ్యా
కొడంగల్ సభలో కేసిఆర్‌పై
ఘాటు విమర్శలు చేసిన రేవంత్

**మహబూబ్‌నగర్,డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):**

తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. మంతరిగా, కేంద్రమంత్రిగా, సిఎంగా పదేళ్లు పనిచేసిన కెసిఆర్ నాలుగు మంచి మాటలు చెప్పకుండా తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నీలాగా తిట్టుడు మొదలు పెడితే తట్టుకోలేవు కెసిఆర్ అంటూ హెచ్చరికలు చేశారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను, నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు..

మిగతా 2లో





### అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం...

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

- మన బిడ్డలే రాష్ట్ర భవిష్యత్తు
- విద్యారంగంపై పెద్ద ఎత్తున పెట్టుబడి
- సంక్షేమంపై స్పష్టంగా ఉన్నాం
- ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నాం
- ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఖమ్మం, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ప్రజల ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టాం అధికారులు, ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకం అనుకున్న లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలి లేదంటే ప్రభుత్వం సహించదు, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం అన్నారు. అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరు విషయంలో సీరియస్ గా ఉండాలి అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలో ఉన్నత స్థానంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు అసెంబ్లీ సమయంలో ముందుగా వెళ్లి ఫేస్ రికగ్నైజేషన్, థంబ్ ఇంప్రెషన్ ఇస్తున్నాం అని వివరించారు. ప్రజలు కష్టంతో వారు చెల్లించిన పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని జీతాలుగా పంచుతున్నాం ప్రజలకు అందరం జవాబు దారిగా ఉండాలి అన్నారు.

మిగతా 2లో

# నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు



- రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజనరీ నేత
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్

**నిజామాబాద్,డిసెంబర్24 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో అత్యధిక కాంగ్రెస్ సర్పంచులు నిజామాబాద్ జిల్లాలోనే గెలుపొందారని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకంగా ఉంటాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క జీవోను కూడా బహిర్గతం చేయలేదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ.1.70 లక్షల కోట్లు విలువైన

మిగతా 2లో



## పంచాయితీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

- లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడుల వంచుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరిక


**కరీంనగర్,డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామ పంచాయతీలకు నెలరోజుల్లోగా నిధులు విడుదల చేయాలని.. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు.

మిగతా 2లో

## జనవరిలో రైతు యాంత్రీకరణ పథకం పునఃప్రారంభం

- ఇప్పటికే రైతుల నుండి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు
- రైతుభరోసా కోసం శాటిలైట్ ఇమెజ్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి
- ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి
- సేంద్రియ వ్యవసాయంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి తుమ్మల



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**

జనవరి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు యాంత్రీకరణ పథకాన్ని పునఃప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని వ్యవసాయశాఖ అధికారులను తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వంలో ఆపేసిన కేంద్ర ప్రభుత్వ పథకాలలో ఒక్కొక్కటిగా మా ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని, ఇప్పటికే జాతీయ ఆహార భద్రత మిషన్ లో భాగంగా పప్పుదినుసుల విత్తనాలను సబ్సిడీపై అందించడం జరిగిందని గుర్తుచేశారు. ఇక ఇప్పుడు రైతు యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు, ఈ పథకంలో భాగంగా 1,31,000 మంది రైతులకు సబ్సిడీపై వివిధ పనిముట్లు/యంత్రాలు అందచేయనున్నట్లు తెలిపారు. రైతు యాంత్రీకరణ పథకం కింద ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జనవరి నెలలోగా ఈ ప్రక్రియను పూర్తిచేసి, రైతులకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా పథకాన్ని జనవరి మొదటి వారంలో ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్ల కాలంలో రైతుబంధు పేరుతో రైతు యాంత్రీకరణ పథకాన్ని నిర్లక్ష్యం చేసిన అప్పటి ప్రభుత్వ వైఖరిని మంత్రి ఈ సందర్భంగా తీవ్రంగా విమర్శించారు. జిల్లా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు జనవరి మొదటి వారంలో మండలాల వారిగా పర్యటించి, రైతులకు అందుతున్న సబ్సిడీలు, యాంత్రీకరణ పథకం దరఖాస్తులు, యూరియా యాప్ అమలు తదితర అంశాలపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ సేకరించాలని మంత్రి సూచించారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కారాలు అందించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే ఒక్క పైసాను కూడా వృధా చేయకూడదనే ఆలోచనతో ఉన్నారని, అందుకోసం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ ఎప్పటికప్పుడు

## శిక్షణ పూర్తి చేసుకున్న యువ ఆపద మిత్రులు

- ధ్రువపత్రాలను అందజేసిన హైడ్రా కమిషనర్
- ఆపదలో ఆదుకునేలా శిక్షణ ఉందన్న వాలంటీర్లు

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**

యువ ఆపద మిత్రులు సిద్ధమయ్యారు. హైడ్రాలో వారం రోజుల శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఆపద సమయంలో ఎలా తనను తాను రక్షించుకోవాలో.. చుట్టు పక్కల వారిని ఎలా కాపాడాలో తెలుసుకున్నారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మొదటి రెస్పాండెంట్‌గా ఎలా స్పందించాలో అవగాహన తెచ్చుకున్నారు. హైడ్రా ఆధ్వర్యంలో

మిగతా 2లో





## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారు

- రేవంత్ రెడ్డి ఊరూరా ప్రచారం చేసినా ఫలితం రాలే
- బిఆర్ఎస్ సర్పంచ్‌ల అభినందనలో హరీష్ రావు

**మెదక్, డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలంటేనే గడగడ వణుకుతున్నడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన నర్సపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

మిగతా 8లో

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నేనున్నంత కాలం.. నీకు అధికారం కల్లే

(మొదటి పేజీ తరువాయి)

ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లి కైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా అంటూ ఘాటైన విమర్శలు చేశారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పండబెట్టిన ఘనుడవని విమర్శించారు. స్థిరాస్తి వ్యాపారం దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితో పాతాళానికి వెళ్లారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసి పెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిరచాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడిరచినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు. నిజమైన చర్చ అసెంబ్లీలో చేద్దాం.. ఎవరు ఏం మాట్లాడుతున్నారో ప్రజలు వింటారని కేసీఆర్ , ఆయన కుటుంబంపై నిప్పులు చెరిగారు. అత్యంత ఘాటైన పదజాలంతో విరుచుకుపడిన సీఎం, తనను , తన కుటుంబాన్ని గతంలో కేసీఆర్ వేధించారని, జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన చేసిన పాపాలే ఆయనను వెంటాడుతున్నాయి. జైల్లో పెట్టి ప్రభుత్వ ఖర్చుతో ఆయనకు తిండి పెట్టడం ఎందుకని నేను ఒక్క కేసు కూడా పెట్టకుండా వదిలేశాను. కానీ ఇప్పుడు సోయి లేకుండా మాట్లాడుతూ తోలు తీస్తా అని స్థాయి లేని మాటలు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ వ్యాఖ్యలకు ప్రతిసవాల్ విసురుతూ, 'రా.. నీ చింతమడకకు రమ్మంటావా లేక కొడంగల్ వస్తావా? ఎక్కడైనా తేల్చుకుందాం. మటన్ కొట్టు మస్తాన్ దగ్గర పొట్టేలును కోసిన తర్వాత తోలు తీసే పని కేసీఆర్‌కు ఇమ్మని చెప్పాను. సాయంత్రం వెళ్లేటప్పుడు దావత్ కోసం ముక్కో బొక్కో ఇచ్చి పంపమని సూచించాను. నన్ను గెలికితే నేను మాట్లాడటం మొదలుపెడితే నువ్వు ఉరి వేసుకుని చస్తావు.




మల్లన్న సాగర్‌లో పడి చావాల్సిందే అని అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే భయంతో సొంత బిడ్డను, అల్లుడిని వెళ్లగొట్టాడని, సొంత చెల్లెలిని పండుగకు కూడా ఇంటికి పిలవలేని వ్యక్తి తన గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. 'పిడకల మూతి బోడిలింగం లాంటి కేటీఆర్, నువ్వు, నీ జాతి అంతా వచ్చినా నేను భయపడను. మీ రాజకీయం ఏంటో చూపిస్తా, రాసి పెట్టుకో' అని సవాల్ విసిరారు. సమావేశంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి , ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# పంచాయితీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

రెండేళ్లుగా రాష్ట్రంలోని పంచాయతీలకు నిధులు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. పంచాయితీలకు ఇచ్చిన నిధులన్నీ కేంద్రానివే అని స్పష్టం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే.. నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల తెలంగాణలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు



జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకుంది. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు.. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదీకాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ కసరత్తు చేస్తుంది. వీటిని సంక్రాంతి పండగ వెళ్లిన తర్వాత చేపట్టాలని భావిస్తుంది. ఒకవేళ ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇది నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# అధికారుల నిర్లక్ష్యాన్ని సహించం... ప్రజా సంక్షేమమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విధులు ఎలా ఉంటాయి అనేది శాఖల వారీగా ప్రోటోకాల్ ఉంటుంది అందరూ దాన్ని పాటించాలి అన్నారు, ఉద్యోగులు అధికారులు ప్రతిరోజు నిద్రపోయే ముందు ప్రశ్నించుకోండి, ప్రభుత్వ ఉద్యోగం లభించడం అదృష్టం అది కొందరికే దక్కే అవకాశం, సామాన్య పౌరునికి సేవలు అందించి బాధ్యతగా ఉండాలి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఉండాలి అన్నారు. మన బిడ్డలే రాష్ట్ర భవిష్యత్తు వారు ప్రపంచంతో పోటీ పడాలని ఆలోచనతో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రం ఎదిగేందుకు 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం అన్నారు. మానవ సంపద సృష్టించడం కీలకం తద్వారా రాష్ట్రానికి పెద్ద ఎత్తున సంపద సమకూరుతుంది అని డిప్యూటీ సీఎం వివరించారు. విలువైన మానవ సంపదను సృష్టించేందుకు విద్యా రంగంపై ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతుంది అన్నారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాం, న్యూట్రిషన్ ఫుడ్ ద్వారా విద్యార్థులకు మంచి ఆరోగ్యం అందించి విలువైన మానవ వనరులు సృష్టించాలనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మొదలు అధికారులు అందరూ విద్యాసంస్థలను పర్యవేక్షించి వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలి ఈ కార్యక్రమం పక్కాగా జరిగితే అద్భుతమైన ఫలితాలు సాధిస్తాం అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఏదైనా సంఘటన జరిగితే అందుకు ఇన్చార్జి అధికారిని బాధ్యునిగా చేస్తామని స్పష్టం చేశారు. గోదాముల్లో వస్తువులను కుక్కినట్టుగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులను నమోదు చేసుకుంటున్నారు ఇకనుంచి ప్రైవేటు విద్యాసంస్థలకు ఉండాల్సిన అర్హతలు, సౌకర్యాలపై ఒక చెక్ లిస్ట్ పెట్టుకొని అవన్నీ ఉంటేనే అధికారులు అనుమతులు ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. సౌకర్యాలు లేని విద్యాసంస్థలను అప్గ్రేడ్ చేసుకోవాలని వెంటనే తెలియజేయండి వచ్చే విద్యా సంవత్సరానికి వారు ఆ రకంగా ఏర్పాటు చేసుకుంటారని డిప్యూటీ సీఎం అని తెలిపారు. సంక్షేమ రంగంపై ప్రభుత్వం స్పష్టంగా ఉంది సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న బిల్లులను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రతి మూడు నెలలకు బిల్లులు సిద్ధం చేసుకుని రాకపోతే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఇప్పటికే చెప్పినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యాసంస్థల అద్దెలు, మెస్, కాస్మోటిక్స్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం అన్నారు. గిరిజనులకు సమగ్ర వ్యవసాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఇందిరా సౌర గిరి జలవికాసం పథకాన్ని తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు. అటవీ భూముల హక్కుల చట్టం కింద భూములు పొందిన రైతులకు ఉచితంగా సోలార్ విద్యుత్తు, పంపుసెట్లు, డ్రిప్పు, ప్లాంటేషన్ సౌకర్యాలు కల్పిస్తాం అధికారులు ప్రతిపాదనలను వేగంగా పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసుకోవాలని గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున వినియోగంలోకి తెచ్చుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు.




# నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు

(మొదటి పేజీ తరువాయి)



పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడిరచారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ నోరు జారి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని మందలించారు. ఆయనలా దిగజారి తాము మాట్లాడమని చెప్పుకొచ్చారు. ప్రజలే కేసీఆర్ అండ్ కోకు బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా తాము దుర్వినియోగం చేయట్లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందించాలంటే విద్యుత్తు ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫామ్‌హౌస్‌లో కూర్చున్న కేసీఆర్ బయటకు వచ్చి విమర్శిస్తున్నారని ఫైర్ అయ్యారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత నేడు మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాము సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, బీమా పథకం అమలు చేస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.



# జనవరిలో రైతు యాంత్రీకరణ పథకం పునఃప్రారంభం

విడుదల చేసేలా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మేరకు ఇప్పటికే కేంద్ర పథకాల కోసం స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి 400 కోట్లను వినియోగించడం జరిగిందని తెలియజేశారు. ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక ఆదాయం ఇచ్చే పంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రైతులకు సబ్సిడీలు అందిస్తూ, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇది రైతుల ఆదాయం పెంచడంలో కీలకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా యాప్‌పై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి విమర్శించారు. ఇప్పటికే ఐదు జిల్లాల్లో యూరియా యాప్ సమర్థవంతంగా అమలవుతోందని, రైతులు కూడా దీనిపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్ష నాయకుల మాటలతో యాప్ అమలులో లేని జిల్లాలలోని రైతులు ఎక్కువగా యూరియా కొంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, యాప్ ద్వారా కూడా రైతులు తమకు కావాల్సినంత యూరియాను కొనుగోలు చేయొచ్చని, కావున రైతులెవరు అనవసర భయాందోళనకు గురి కావద్దని మంత్రి కోరారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా యూరియా యాప్ ను అమలు చేస్తామని మంత్రిగారు స్పష్టం చేశారు. ??రబీ సీజన్ రైతుభరోసా కోసం శాటిలైట్ ఇమేజ్ మ్యాపింగ్ ను త్వరితగతిన పూర్తి చేసి, రైతుభరోసా నిధులు త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను రైతులకు వివరించి, దీర్ఘకాలికంగా మట్టిసారాన్ని కాపాడుతూ ఖర్చులు తగ్గించే విధానాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అండగా నిలిచేలా అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



# శిక్షణ పూర్తి చేసుకున్న యువ ఆపద మిత్రులు

యువ ఆపద మిత్ర శిక్షణ పూర్తి చేసుకున్న 78 మంది వాలంటీర్లకు మంగళవారం హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ధ్రువపత్రాలను అందజేశారు. %చీణవీ% (నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) ప్రారంభించిన యువ ఆపద మిత్ర పథకంలో భాగంగా నిజామాబాద్ లోని గిరిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎంపికైన 78 మంది వాలంటీర్లకు గత బుధవారం హైడ్రాలో శిక్షణ ప్రారంభమైన విషయం విధితమే. వారం రోజుల శిక్షణ పూర్తయిన సందర్భంగా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు వారితో మాట్లాడారు. శిక్షణ ఎలా జరిగింది.. ఏం నేర్చుకున్నారో నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. సాధన చేస్తే సాధించలేనిది ఏమీ లేదు..సాధన చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదని యువ ఆపద మిత్ర వాలంటీర్లకు హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు సూచించారు. వారం రోజుల హైడ్రా శిక్షణలో నేర్చుకున్న అంశాలతో పాటు.. మీరు గొప్ప వ్యక్తులుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవడంలో కూడా పూర్తి అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మీరంతా యువ ఆపద మిత్రులు.. మీ ప్రత్యేకతను చాటాలని సూచించారు. ప్రమాద సమయంలో గందరగోళానికి గురి కాకుండా.. తక్షణ సహాయకులుగా రంగంలోకి దిగాలన్నారు. తర్వాత వివిధ విభాగాలకు చెందిన వారితో సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. అందుకే క్షేత్ర స్థాయిలో పరిస్థితులను కూడా ఈ శిక్షణలో భాగం చేశామన్నారు. తోటివారికంటే మీరు ముందుండడమే కాదు.. సహచరులకు కూడా అవగాహన కల్పించి ఆపద సమయంలో మీతో కలసి పని చేసేలా సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు. జిల్లాల్లో కూడా ఇలాంటి శిక్షణ ఉంటే బాగుంటుందని విద్యార్థినులు చేసిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ శిక్షణ అవసరముందని చెప్పారు. వారం రోజుల శిక్షణ ఇలా సాగింది.. హైడ్రా కమిషనర్ ఆదేశాలమేరకు.. యువ ఆపద మిత్ర వాలంటీర్లకు క్షేత్ర స్థాయిలో కూడా పలు విషయాలపై అవగాహన కల్పించామని హైడ్రా అధికారులు వివరించారు. అగ్ని ప్రమాదంలో ఒకే ఇంట్లో 17 మంది ప్రాణాలు కోల్పోయిన పాతబస్తీ గుల్జార్ హౌస్ ప్రాంతానికి తీసుకెళ్లామన్నారు. బతుకమ్మ కుంటలో బోటు ద్వారా వరదల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలో, ప్రథమ చికిత్స ఎలా అందించాలో వివరించాం. వంటింటి ప్రమాదాలతో పాటు అగ్ని ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రాక్టికల్ గా చెప్పామన్నారు. వాతావరణ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లి.. వాతావరణ సమాచారాన్ని ఎలా అర్థం చేసుకోవాలి.. ఐసీసీసీ(కమాండ్ కంట్రోల్ రూం)లో తెలంగాణ వ్యాప్తంగా నిఘా వ్యవస్థ ఎలా పని చేస్తోందనే విషయాలు చూపించామని చెప్పారు. హైడ్రా అదనపు సంచాలకులు శ్రీ వర్ల పాపయ్యగారు, అడిషనల్ కమిషనర్ శ్రీ ఆర్. సుదర్శన్ గారు, ఆర్ ఎఫ్ వో శ్రీ జయప్రకాష్ గారు, డీఎఫ్‌వో శ్రీ గౌతమ్ గారు, ఏడీఎఫ్‌వో మోహనరావుగారు, మై భారత్ స్టేట్ కోర్డినేటర్ శ్రీ రాజేష్ గారితో పాటు.. ఎస్ ఎఫ్ వోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాలో ధైర్యాన్ని పెంచిన హైడ్రా శిక్షణ

హైడ్రా శిక్షణలో అనేక విషయాలు తెలుసుకున్నామని యువ ఆపద మిత్ర వాలంటీర్లు తెలిపారు. బయట ప్రపంచాన్ని చూశామన్నారు. ప్రభుత్వ విభాగాలు ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నామని చెప్పారు. ఈ వారం రోజుల పాటు నేర్చుకున్న లైఫ్ స్కిల్స్ జీవితాంతం ఉపయోగపడే విధంగా ఉన్నాయన్నారు. ప్రమాద సమయంలో గందరగోళానికి గురి కాకుండా.. ఎలా స్పందించాలి,. ఎలా నివారించాలి.. అనే విషయాలు క్షుణ్ణంగా తెలుసుకున్నాం. పాఠ్యాంశాల బోధన కూడా ఇలా జరిగితే.. ఎంతో ఉపయోగంగా ఉంటుందని వాలంటీర్లు తెలిపారు. తరగతి గదిలో విషయాలను విని.. క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్‌గా తెలుసుకున్నామన్నారు. ఈ శిక్షణతో మాలో ఎంత ధైర్యం వచ్చింది. మాతో పాటు తోటివారిని రక్షించే విధంగా మేమంతా సిద్ధమయ్యామని సంతృప్తి వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, తోటివారితో ఎలా మాట్లాడాలి ఇలా అనేక అంశాలు తెలుసుకున్నాం.. హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారితో రెండుసార్లు కలిసే అవకాశం రావడం.. ఈ సందర్భంగా చెప్పిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని వాలంటీర్లు చెప్పారు.

# ఉత్తమ ఇంటీరియర్ డిజైన్ అవార్డు అందుకున్న పద్మజ సింగ్





**హైదరాబాద్, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** హైటెక్ సిటీ నోవోటల్ హోటల్‌లో హైబీజ్ టీవీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉత్తమ పారిశ్రామికవేత్తల అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఉత్తమ ఇంటీరియర్ డిజైనర్ విభాగంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ది లోటస్ స్టూడియో అధినేత్రి పద్మజ సింగ్ ఉత్తమ ఇంటీరియర్ డిజైన్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును హైబిజ్ టీవీ అధినేత రాజగోపాల్ రెడ్డి ఆమెకు అందజేశారు.గత 22 సంవత్సరాలుగా ఇంటీరియర్ డిజైన్ రంగంలో పద్మజ సింగ్ అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పద్మజ సింగ్ మాట్లాడుతూ, ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు.అపార్ట్మెంట్లు, విల్లాలు, ఆఫీసులు, హాస్పిటళ్లు, జువెల్లరీ షోరూమ్‌లు, ఫామ్ హౌస్‌లకు ప్రత్యేకంగా ఫర్నిచర్ డిజైన్ విభాగంలో ది లోటస్ స్టూడియో సేవలు అందిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్‌లో మరిన్ని బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అవార్డు అందుకున్న సందర్భంగా రాజ్ సింగ్, గౌతమ్, మానస పద్మజ సింగ్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

# మంచి వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి



◆ డ్రగ్స్, మైనర్లకు మద్యం పై ఉక్కుపాదం : సీపీ సుధీర్ బాబు ఐపీఎస్



**రాచకొండ, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** నూతన సంవత్సర వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ఇన్సిడెంట్ ఫ్రీగా నిర్వహించుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ ప్రజలకు, నిర్వాహకులకు పిలుపునిచ్చారు. ఒక్క ప్రమాదం కూడా జరగకూడదని, ఒక్క ప్రాణం కూడా పోకూడదని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై రాచకొండ పరిధిలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లు, ఫామ్ హౌస్‌లు, వైన్ షాపులు, ఈవెంట్ ఆర్గనైజర్లతో కమిషనర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వేడుకల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, ఎస్ఓటీ, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు.ఔట్‌డోర్ ఈవెంట్లలో డీజేలకు అనుమతి లేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నిర్ణయించిన పరిమితికి మించి ప్రేక్షకులను అనుమతించరాదని ఆదేశించారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. పబ్‌లు, బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయాలని, పబ్‌లు, రెస్టారెంట్లు, షాపుల పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.నగర శివార్లలోని ఫామ్ హౌస్‌లలో నిర్వహించే కార్యక్రమాలు కూడా నిబంధనలకు లోబడి ఉండాలని, డ్రగ్స్ వినియోగం, అసభ్యకర డాన్స్ కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు.డ్రంకెన్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా కొన్ని ఫ్లైఓవర్లను తాత్కాలికంగా మూసివేస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి ఐపీఎస్, ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ ఐపీఎస్, మల్కాజిగిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్ ఐపీఎస్, యాదాద్రి డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ ఐపీఎస్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యేసు బోధనలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.!



◆ విశ్వశాంతి విద్యాలయంలో ఘనంగా క్రీస్తు జన్మదిన వేడుకలు.



**సత్తుపల్లి, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** యేసు క్రీస్తు బోధనలు విద్యార్థుల చదువు, ప్రవర్తన, జీవిత లక్ష్యాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు.

బుధవారం విశ్వశాంతి విద్యాలయంలో ముందస్తుగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు మహిమను ప్రతిబింబించే గీతాలకు విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. అనంతరం కేకు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, యేసు బోధనలు అలవర్చుకుంటే విద్యార్థులు స్నేహితులు, ఉపాధ్యాయులతో సౌహార్దపూర్వకంగా మెలగడం నేర్చుకుంటారని చెప్పారు. ప్రేమ, దయ, సేవాభావం, క్షమ గుణాల వల్ల కోపం, ద్వేషం తగ్గి మంచి మనసు అలవడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అహంకారం లేకుండా వినయం, ఇతరులకు సహాయం చేయడం, ఆత్మవిశ్వాసం, ధైర్యం, సహనం, క్రమశిక్షణ, ఇతరులను గౌరవించడం వంటి గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. మంచి ఆలోచనలు, మంచి జీవన మార్గాన్ని అనుసరించే వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు.

యేసు బోధనలు విద్యార్థుల్లో మంచి వ్యక్తిత్వం, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి వారిని విజయవంతమైన, మానవత్వం గల వ్యక్తులుగా తయారు చేస్తాయని పేర్కొన్నారు. ప్రపంచానికి ప్రేమ, శాంతి, క్షమ వంటి గొప్ప విలువలను యేసు క్రీస్తు బోధించారని గుర్తు చేశారు.

"ప్రేమించండి - సేవ చేయండి - క్షమించండి" అనేదే యేసు జీవిత సందేశమని తెలిపారు. ప్రేమ వల్ల ఇతరులను గౌరవించడం, క్షమ వల్ల కోపం, ద్వేషం దూరమవుతాయని, నిజాయితీ వల్ల జీవితం వెలుగొందుతుందని వివరించారు.

అలాగే క్రిస్మస్ ట్రీ, స్టార్, కేక్‌ల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

# నాచారం–మల్లాపూర్ డివిజన్ సరిహద్దుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**నాచారం, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ నాచారం మరియు మల్లాపూర్ డివిజన్‌ల సరిహద్దుల్లో మొత్తం రూ.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. బాబా నగర్ మరియు హనుమాన్ నగర్ ప్రాంతాల్లో రూ.40 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు, అలాగే బాబా నగర్‌లోని పలు ప్రాంతాల్లో రూ.35 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న బాబా నగర్, దుర్గా నగర్ ప్రాంతాలు నాచారం డివిజన్‌లోకి వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాంతాల్లో ఉన్న అన్ని మౌలిక సదుపాయాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని, అలాగే నాచారం-మల్లాపూర్ కార్పొరేటర్లను స్థానిక ప్రజలు శాలువాలు, పూలదండలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం సతీష్, ఏఈ సిరాజ్, ఇంజనీరింగ్ డీఈ రూప, ఏఈ స్రవంతితో పాటు బాబా నగర్, హనుమాన్ నగర్‌కు చెందిన బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీర్పేట్ హెచ్‌బీ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి



**కాప్రా, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్‌లో పలు కాలనీల్లో సుమారు రూ.17 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తూ, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.అభివృద్ధి పనుల విషయంలో అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ,డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, డివిజన్ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్స్పెక్టర్ చారి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.చేపట్టిన పనుల వివరాలు:రాజీవ్ నగర్ కాలనీ - చర్చి గల్లీ,గడ్డమీద.కైలాసగిరి - 30 ఫీట్ రోడ్ ట్రాన్స్ఫార్మర్ వద్ద హెచ్‌బీ కాలనీ - ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వార్డు కార్యాలయం వెనుక కృష్ణానగర్ - రోడ్ నెంబర్ 5 కె కృష్ణానగర్ - రోడ్ నెంబర్ 3 న్యూ నరసింహ నగర్ - వాగ్దేవి స్కూల్ వద్ద ఓల్డ్ మీర్పేట్ - రామకృష్ణ స్కూల్ ఎదురు గల్లీ,నరసింహనగర్ - ఎనుముల మహేష్ గల్లీ ఓల్డ్ మీర్పేట్ - కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం

# కరుణాలయానికి 50 కేజీల బియ్యం విరాళంగా అందజేసిన రిపోర్టర్ అనిల్ రాజ్



**ధర్మసాగర్,డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** క్రిస్మస్ పండుగ సందర్భంగా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని కరుణాలయంలో అనాథ పిల్లలకు సహాయం అందించారు. రిపోర్టర్ అనిల్ రాజ్ తన తాత గొల్లపల్లి రాజయ్య, నానమ్మ వెంకటమ్మల జ్ఞాపకార్థంగా 50 కేజీల బియ్యాన్ని కరుణాలయానికి విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమానికి కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనాప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనాథ పిల్లల సంక్షేమానికి ఇటువంటి సేవలు మరింత విస్తరించాలని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి నారాయణ, ఎం.డి. శంషుద్దీన్, చిట్యాల రమేష్, కందుకూరి అజయ్ చందర్, కందుకూరి ప్రభాకర్, ఎం.డి. నశిరోద్దీన్, ఫా. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సేవాభావంతో ముందుకు వచ్చిన అనిల్ రాజ్‌ను పలువురు అభినందించారు.

# మణిగిల్ల గ్రామంలో సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన చేపట్టిన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



◆ మార్నింగ్ వాక్ సందర్భంగా 10వ వార్డులో డ్రైనేజ్ సమస్యపై చర్చ

**పెద్దమందడి,డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో నూతన గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ బుధవారం ఉదయం నిర్వహించిన మార్నింగ్ వాక్ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యంగా గ్రామంలోని 10వ వార్డులో తీవ్రంగా ఉన్న డ్రైనేజ్ సమస్యపై స్థానికులతో సర్పంచ్ చర్చించారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగు నీరు రోడ్లపై నిలిచిపోతూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వార్డు వాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనివల్ల దోమల బెడద పెరిగి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు.దీనిపై స్పందించిన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా మౌలిక వసతుల సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరిస్తామని తెలిపారు. 10వ వార్డులో డ్రైనేజ్ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

గ్రామ బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్న సర్పంచ్ ప్రయత్నాలు అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి వార్డులో ఇలాంటి పరిశీలనలు కొనసాగించి గ్రామ అభివృద్ధిని వేగవంతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంతో గ్రామస్తుల్లో నూతన గ్రామ పాలనపై నమ్మకం మరింత బలపడిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# జిల్లాస్థాయి పాలిటెక్నికల్ క్రీడల్లో సాయిస్ఫూర్తి విద్యార్థుల ప్రతిభ.!

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**సత్తుపల్లి, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక మండల పరిధిలోని బి.గంగారం గ్రామంలో స్వయంప్రతిపత్తి కలిగిన సాయి స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు జిల్లాస్థాయి పాలిటెక్నికల్ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి పలు విభాగాల్లో విజయాలు సాధించారు. కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల క్రీడా మైదానంలో జనవరి 19, 20 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా పది పాలిటెక్నికల్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సాయిస్ఫూర్తి కళాశాల విద్యార్థులు వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగాల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు.

సాధించిన విజయాలు: వాలీబాల్ విన్నర్స్, గర్ల్స్ వాలీబాల్ రన్నర్స్, బ్యాడ్మింటన్ బాయ్స్ డబుల్స్ రన్నర్స్, బ్యాడ్మింటన్ గర్ల్స్ సింగిల్స్ రన్నర్స్, బ్యాడ్మింటన్ గర్ల్స్ డబుల్స్ రన్నర్స్, లాంగ్ జంప్(గర్ల్స్) ద్వితీయ స్థానం, 200 మీటర్ల పరుగు(గర్ల్స్) ద్వితీయ స్థానం. వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వాలీబాల్ జట్టు పాల్గొననుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో నాలుగోసారి సాయిస్ఫూర్తి పాలిటెక్నికల్ విభాగం విద్యార్థులు విజయాలు సాధించడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలోనూ మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. క్రీడలతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, డిప్లొమా డీన్ తోమండ్రు రాంబాబు, విభాగాధిపతులు విద్యార్థులను అభినందించారు.



# ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి అడ్డంకులు

- తక్షణమే పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్
- నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

**పెద్దమందడి,డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామపంచాయతీలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ సహకరించడం లేదని ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించేందుకు ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులు కావాలనే కాలయాపన చేస్తూ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నారని వారు ఆరోపించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌కు ముందుగానే తెలియజేసినా, రాజకీయ ఒత్తిళ్లకు లోబడి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి సహకరించడం లేదని ఎన్నికైన సభ్యులు తెలిపారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానపర్చడమేనని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మోజర్ల గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఎన్నికైన ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మీడియా సమావేశం నిర్వహించి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని, గ్రామపంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకొని ఆయనను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అధికారుల తీరుతో ప్రజలు ఇచ్చిన తీర్పుకు అవమానం జరుగుతోందని, తక్షణమే ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికైన ప్రజాప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం.!

## ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ భవనాలు ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్రబిందువులుగా ఉండాలని అన్నారు. అలాగే కమ్యూనిటీ భవనాలు గ్రామస్తుల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి గ్రామంలో అవసరమైన ప్రభుత్వ భవనాలు, మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో అశ్వారావుపేట నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులు మానసికంగా కృంగిపోకుండా రాణించాలి

105 మందికి మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు పంపిణీ చేసిన ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్ కుమార్

**హైదరాబాద్, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** దివ్యాంగులు మానసికంగా కృంగిపోకుండా అన్ని రంగాల్లో రాణించాలని, వారి అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈసీఐఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ తెలిపారు. అణుశక్తి శాఖ (డీఏఈ) ఆధ్వర్యంలోని సీపీఎస్ఈ సంస్థ అయిన ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా నల్గొండ జిల్లా దివ్యాంగులకు బ్యాటరీతో పనిచేసే మోటరైజ్డ్ ట్రైసైకిళ్లను పంపిణీ చేసింది. బుధవారం జరిగిన కార్యక్రమంలో నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐఏఎస్ సమక్షంలో 105 మంది లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా అనురాగ్ కుమార్ మాట్లాడుతూ, శారీరక పరిమితుల కారణంగా రోజువారీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్న దివ్యాంగులకు ఈ ట్రైసైకిళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. సహాయక పరికరాలు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో ఉన్న వారికి స్వావలంబన, స్వాతంత్ర్యం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సమగ్ర, స్థిరమైన అభివృద్ధికి ఈసీఐఎల్ సీఎస్ఆర్ కార్యకలాపాల ద్వారా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈసీఐఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి. కృష్ణ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా కేవలం ట్రైసైకిళ్లను మాత్రమే కాకుండా, దివ్యాంగులకు స్వేచ్ఛ, గౌరవం, గొప్ప కలలు కనే అవకాశాన్ని ఈసీఐఎల్ అందిస్తోందని అన్నారు. నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం కోసం ఈసీఐఎల్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈడీ (హెచ్ఆర్) సంతోష్ రామస్వామి, సీఎంఓ & ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ డాక్టర్ పి. వేణు బాబు, డిప్యూటీ మేనేజర్ (హెచ్ఆర్) సునీల్ కుమార్, ఆఫీసర్‌టి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# కుషాయిగూడలో రాచకొండ పోలీస్ ఉచిత మెగా వైద్య శిబిరం

- వృద్ధుల ఆరోగ్యానికి రాచకొండ పోలీసుల ప్రత్యేక శ్రద్ధ

**కుషాయిగూడ, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రాచకొండ కమిషనరేట్ కుషాయిగూడ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డైరెక్టర్ జనరల్ & రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధులను కలుసుకుని వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సిటిజన్ కేర్ అండ్ కన్సర్న్ డెస్క్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల ఒక వైద్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించామని,





అందులో భాగంగానే ఇది మూడో హెల్త్ క్యాంప్‌గా నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. కుషాయిగూడ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు పోలీస్ స్టేషన్లకు చెందిన వృద్ధులకు ఈ శిబిరం ద్వారా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పోలీసులు నేరుగా వృద్ధుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడంతో పాటు, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్డు భద్రత అంశాలపై కూడా సూచనలు ఇస్తున్నట్లు సుధీర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధులు తమ సమస్యలను పోలీసులతో పంచుకునే అవకాశం లభిస్తోందని, అదే సమయంలో వారికి భరోసా కల్పిస్తూ నేర నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని అన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న సందర్భాల్లో వారికి తగిన సహాయం అందిస్తున్నామని తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతోనే రాచకొండ కమిషనరేట్ ఈ తరహా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# బస్వాపురం అభివృద్ధికి సహకరించండి...

## సర్పంచ్ ఆవుల నరసింహారావు

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండల పరిధిలో ఉన్నటువంటి బస్వాపురం అభివృద్ధికి సహకరించి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారుల భాగస్వామ్యం కావాలని నూతన సర్పంచ్ ఆవుల నరసింహారావు అధికారులను కోరారు. నూతన సర్పంచిగా బాధ్యతలు స్వీకరించిన నరసింహారావు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, తహసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఎస్సై వీరేందర్, ఐకెపి ఎపిఎం నాగ పుల్లారావు, విద్యుత్ ఏఈ చావా శ్రీధర్, మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ లను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ అధికారుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రామంలో సమస్యల సాధన కోసం అధికారులు తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రకాని నరసింహారావు, గ్రామ పెద్దలు రాసాల మోహన్ రావు, మార్గం శ్రీను, బద్దల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరానగర్ మాజీ సర్పంచ్ కడారి రమ ప్రసాద్ బీజేపీలో చేరిక



◆ బండి సంజయ్ సమక్షంలో పార్టీలోకి ఆహ్వానం

**ఎల్కతుర్తి. డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కడారి రమ ప్రసాద్ బీజేపీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కడారి రమ ప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి అధికారికంగా పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా కడారి రమ ప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధి, రాష్ట్ర ప్రగతి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్న బీజేపీ విధానాలు తనను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. ఇందిరానగర్ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ అడుగుజాడల్లో నడుస్తూ పనిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు యువత, మహిళలను పార్టీలో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహిస్తానని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో మాట్లాడిన బండి సంజయ్ గారు కడారి రమ ప్రసాద్ లాంటి అనుభవజ్ఞులు బీజేపీలో చేరడం పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని అన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బీజేపీని బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కృషి కీలకమని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ ఇందిరానగర్ గ్రామంలో బీజేపీకి ప్రజాబలం మరింత పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ రానున్న రోజుల్లో ఎల్కతుర్తి మండలంలో బీజేపీ జెండాను ఎగరవేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన



శాలపల్లి గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సర్పంచ్, ఉపసర్పంచ్

**వేలేరు 24 డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం శాలపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు నాయకులుగా కాకుండా సేవకులుగా ప్రజల వద్దకే వెళ్లి పాలన సాగిస్తున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్, ఉపసర్పంచ్ ఎర్రగొల్ల రమేష్ ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుంటున్నారు.
గ్రామంలో మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు, రోజువారీ అవసరాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ, సాధ్యమైన పరిష్కారాల కోసం తక్షణ చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి పారదర్శకంగా పాలన అందించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు.ప్రజల మధ్య తిరుగుతూ సమస్యలను స్వయంగా వింటున్న సర్పంచ్, ఉపసర్పంచ్‌ల విధానంపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇది గ్రామాభివృద్ధికి మంచి ఆరంభమని అభిప్రాయపడుతున్నారు





## ఎస్ ఆర్ సి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

◆ స్వర్ణరాజ్ శివమణి, విట్టల్ నాయక్

**కాప్రా, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఎస్ ఆర్ సి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థ సీఈఓ ఈకోతనీరు శ్రీహరి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి మారియో,మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వేడుకల్లో పాల్గొన్న అతిథులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి పండుగ వేడుకలు సమాజంలో ఐక్యత, సౌహార్ద్రాన్ని పెంపొందించడం లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ సి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ రాము, పవన్, మనోజ్, సంతోష్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.







## అల్టిట్యూడ్ హైస్కూల్లో అట్టహాసంగా క్రిస్మస్ వేడుకలు

**ఎల్కతుర్తి, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** అల్టిట్యూడ్ హైస్కూల్లో క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. చిన్నారులు శాంటా క్లాజ్ డ్రెస్సులు ధరించి వేషధారణలతో, ఆటపాటలు, కోలాటం, నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన డాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ యొక్క గొప్పతనం, ఈ పండుగను ఎందుకు జరుపుకుంటామనే అంశాలను వివరించారు. యేసు క్రీస్తు దేవుని కుమారుడిగా ప్రపంచానికి ప్రేమ, శాంతి, క్షమ మరియు త్యాగం అనే విలువలను బోధించారని తెలిపారు. యేసు దేవుని విశిష్టత మానవాళికి దారి చూపే వెలుగుగా నిలిచిందని, ఆయన బోధనలు నేటి సమాజానికి ఎంతో ప్రాసంగికమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నవీన్, హెడ్మాస్టర్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ప్రీ-ప్రైమరీ ఇంచార్జ్ అంబాల లావణ్యతో పాటు సరిత, రమ్య, భవాని, దివ్య, రచన, మౌనిక తదితర ఉపాధ్యాయులు, ఉపాధ్యా

## పెరియార్ రామస్వామి నాయకర్ 52వ వర్ధంతి సంస్మరణ కార్యక్రమం

**ఏ ఎస్ రావు నగర్, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం - స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం కమలానగర్ కార్యాలయంలో సామాజిక సంస్కర్త పెరియార్ రామస్వామి నాయకర్ 52వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ముందుగా స్ఫూర్తి గ్రూప్ యువ నాయకులు గిరీష్ కుమార్, సీనియర్ నాయకులు కృష్ణమాచార్యులు పెరియార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ, సామాజిక చైతన్యం కల్పించడంలో పెరియార్ చేసిన కృషి అమూల్యమని తెలిపారు. మనువాద దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడా




రని, నేటికీ తమిళనాడులో ద్రవిడ ఉద్యమం బలంగా కొనసాగడానికి పెరియార్ ఆలోచనలే పునాదిగా నిలిచాయని అన్నారు. మూఢాచారాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నాస్తిక భావజాలంతో ఆయన సాగించిన ఉద్యమాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పెరియార్‌కు గురుతుల్యులైన జ్యోతిరావు పూలే రచించిన 'గులాంగిరి' పుస్తకంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. ముందుగా ఎం. భాస్కర్ రావు పుస్తకాన్ని పరిచయం చేశారు. సామాజిక ఉద్యమ నాయకులు జయరాజు మాట్లాడుతూ, 'గులాంగిరి' గ్రంథం నేటి సమాజానికీ సమానంగా వర్తిస్తుందని అన్నారు. బ్రాహ్మణీయ భావజాలం, ముఖ్యంగా మనువాదం ప్రజలను విషచక్రంలో నెట్టిందని విమర్శించారు. జ్యోతిరావు పూలే అనేక వివక్షలను ఎదుర్కొని విద్య ద్వారానే విముక్తి సాధ్యమని నమ్మి, అందరికీ చదువు అందించే మహత్తర ఉద్యమాన్ని చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివన్నారాయణ, రహీం, కృష్ణమాచార్యులు, గిరీష్, మల్లేష్, రుక్కయ్య, గుమ్మడి హరిప్రసాద్ తదితరులు ప్రసంగించారు. అణగారిన వర్గాలు స్వయం గులాంగిరిని అనుభవించిన దుస్థితిని ఈ గ్రంథం ప్రతిబింబిస్తుందని, దానికి వ్యతిరేకంగా పోరాడాలని పూలే ఇచ్చిన పిలుపును ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. అంతకుముందు పెరియార్ చిత్రపటానికి అందరూ పూలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, గౌస్య, జయరాజు, వెంకటయ్య, ఎన్. శ్రీనివాస్, మల్లేష్, భాస్కర్ రావు, శివన్నారాయణ, హరిప్రసాద్, కోమటి రవి, రుక్కయ్య పాల్గొన్నారు.

## సెరినిటీ పాఠశాలలో ఘనంగా క్రిస్మస్, స్వయం పాలనా దినోత్సవ వేడుకలు

**నాగారం, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** జిహెచ్ఎంసి నాగారం మున్సిపాలిటీ పరిధిలో సెరినిటీ పాఠశాలలో క్రిస్మస్ మరియు స్వయం పాలనా దినోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ మానవాళికి సేవాతత్పరత, శాంతిని బోధించిన ఏసుక్రీస్తు ఉపదేశాలు సర్వమానవాళికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.పాఠశాల ఆవరణలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా కీసర మాజీ జిల్లా ప్రాదేశిక సభ్యులు ముప్పు రాంరెడ్డి హాజరై,





చిన్నారులకు ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు ప్రేక్షకులను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.స్వయం పాలనా దినోత్సవంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి బోధన చేయడం, పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వయంగా నిర్వహించడం



విశేషంగా నిలిచింది. తమ పాత్రల్లో పూర్తిగా లీనమై, ఆనందోత్సాహాలతో కర్తవ్య నిర్వహణ చేయడం అందరినీ ఆకర్షించింది.చిన్న వయసులోనే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడం భవిష్యత్ జీవితానికి ఎంతో ఉపయోగకరమని కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి తెలిపారు. ఈ రోజంతా చిన్నారుల ఆటపాటలు, కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ రెండు కార్యక్రమాల్లో పాఠశాల ప్రధాన కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# 'డబుల్' ఇండ్ల స్థలాలు కుదరవు

- రెండు, మూడు సార్లు తీసుకుంటామంటే ఊరుకోబోం
- విచారణ తర్వాతే అధికారులు నిర్ణయం తీసుకోవాలి
- డెస్క్ జర్నలిస్టులకూ అక్రిడిటేషన్లే ఇవ్వాలి
- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశం తీర్మానం
- అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 4వ మహాసభలో మంత్రి పొంగులేటి ఇచ్చిన హామీ మేరకు 48 గంటల్లోనే అక్రిడిటేషన్ల విషయంలో జీవో జారీ చేశారని, ఇండ్ల స్థలాల విషయంలో కూడా కొత్త సంవత్సరంలో తీపి కబురు అందిస్తామని చెప్పిన నేపథ్యంలో ఆ దిశగా కూడా నిర్ణయం తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. ఇండ్ల స్థలాల విషయం ప్రస్తుతం చర్చకు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ద్వారా గతంలో ఇంటిస్థలం తీసుకుని మరలా కావాలని ముందుకు వస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఇంతవరకూ ప్రభుత్వం నుంచి లబ్ధిపొందని జర్నలిస్టుల పక్షానే తాము ఉంటామని స్పష్టం చేశారు. ఖమ్మం గాంధీచౌక్ లోని ఓ హోటల్లో బుధవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఇండ్ల స్థలాలతో పాటు అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని కోరారు. డెస్క్ జర్నలిస్టులకు సైతం రిపోర్టర్లతో సమానంగా అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో కొందరు జర్నలిస్టులు ఇప్పటికే సొసైటీ, బీపీఎల్ కోటా, జీవో నెం 58, 59 ద్వారా ఇండ్ల స్థలాలు పొందారని, తిరిగివారే మళ్లీ ముందు వరుసలో ఉంటున్నారని తెలిపారు. అధికారులు పూర్తి విచారణ చేసిన తర్వాతే అర్హులను గుర్తించాలని సూచించారు. దశాబ్దాలుగా జిల్లాలో జర్నలిస్టులుగా పనిచేస్తున్న అనేకమందికి ఇప్పటికీ ప్రభుత్వం ద్వారా ఇండ్ల స్థలం రాలేదని, త్వరలో ఆ ఆశ నేరవేరనున్నదని చెప్పారు. జర్నలిస్టుల పక్షపాతిగా టీడబ్ల్యూజేఎఫ్ వారికి అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు. అదేవిధంగా టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అక్రిడిటేషన్ల విషయంలో 48 గంటల్లోనే మాట నిలబెట్టుకున్నారని, వచ్చే నెలలో ఇండ్ల స్థలాల విషయంలో కూడా తీపి కబురు అందిస్తారనే ఆకాంక్షను వెలిబుచ్చారు. డెస్క్ జర్నలిస్టులను వేరుచేసి వారికి అక్రిడిటేషన్ బదులు మీడియా కార్డును ఇవ్వాలని ప్రెస్ అకాడమీ చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు.

ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నిక

సమావేశంలో భాగంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా దగ్గుపాటి మాధవరావు, సెక్రటరీగా నూకల రామచంద్రమూర్తి, కోశాధికారిగా ధనాలకోట రవికుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీనియర్ జర్నలిస్టులకు సన్మానం

సీనియర్ జర్నలిస్టులు ప్రసేన్, పారుపల్లి కృష్ణారావు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు నాదెళ్ల శ్రీనివాస్ తదితరులను జిల్లా, ఖమ్మం నియోజకవర్గ కమిటీలు సన్మానించాయి.

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి జక్కంపూడి కృష్ణ, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవి కిరణ్, స్టేట్ కౌన్సెల్ సభ్యులు నలుబోల మధు శ్రీ, బాలకృష్ణ, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాజేంద్ర మూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి వీసారపు అంజయ్య, ఉపాధ్యక్షురాలు భారతి, టీబీజేఏ ఫొటో & వీడియో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కొత్తా యాకేష్, అయ్యప్ప, దేవేందర్, మోహన్ రావు, బంక వెంకటేశ్వర్లు, శాబాదు కరుణాకర్ రెడ్డి, పెండ్ర అంజయ్య, షేక్ అఫ్జద్, యాస లక్ష్మారెడ్డి, కొత్తా సుధాకర్, మేడా సంపత్, చల్లా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# స్మార్ట్ కిడ్జ్ లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- ఏసుప్రభు, మేరీమాత, దేవదూతల వేషధారణలో కనువిందు చేసిన చిన్నారులు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కరెస్పాండంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య

**ఖమ్మం బ్యూరో ,డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఆనంద ఉత్సాలతో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పశువులపాక సెట్టింగ్ ఏర్పాటు చేసి ఏసుప్రభు రాకను దేవదూతలు తెలియజేసే సన్నివేశాలను చిన్నారులు ప్రదర్శించారు. ఏసుప్రభు, మేరీ మాత వేషధారణలో క్రీస్తు జనన వేడుకను సంబరంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పాఠశాల విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ యేసు ప్రభు జనన వేడుక లోకానికి పర్వదినం అని తెలిపారు. యేసు ప్రభు అందించిన బోధనలు కరుణా, శాంతి సమాధానం అందరూ అలవర్చుకోవాలన్న సందేశాన్ని మనకు తెలియజేశారని తెలిపారు. తమ పాఠశాలలో అన్ని పర్వదినాల వేడుకలను నిర్వహించడం ద్వారా అన్ని మత ధర్మాల సాంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ ఉన్నత పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ విద్యార్థులకు ఏసుక్రీస్తు జన్మదిన ప్రాముఖ్యతను, శాంతి సందేశాన్ని తెలియజేశారు. చిన్నారులు శాంతాక్లాజ్, దేవదూతల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఆర్ ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# క్రీస్తు ప్రేమ, త్యాగం, దయ, కరుణ, ఆదర్శం....

**శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు**

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఉన్నటువంటి శ్రీ గ్లోబల్ హై స్కూల్ నాగులవంచలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏసుక్రీస్తు పుట్టుక, ఆయన చూపించిన ప్రేమ, త్యాగం, దయ, కరుణ, వాత్సల్యం అందరూ కలిగి ఉండాలని ఆ విధంగానే జీవించాలని స్మరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజ్మెంట్ అయిన దివాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వాహిని, తిరుపతిరెడ్డి మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




# 23.02 ఎకరాల ఖమ్మం జర్నలిస్టుల ఇళ్ల స్థలాన్ని తక్షణం అప్పగించాల్సిందే



- ఎం.పీ.జే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ డిమాండ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** ఎం.పీ.జే జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం నగరానికి విచ్చేసిన అబ్దుల్ మజీద్ షోయబ్‌ను, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్ - హెచ్ 2843) జిల్లా అధ్యక్షులు టి.సంతోష్ చక్రవర్తి నేతృత్వంలో జర్నలిస్టు నాయకులు, మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్యను వినతి పత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశంపై స్పందించిన అబ్దుల్ మజీద్ షోయబ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా గత ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం అర్హులైన ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన, 23.02 ఎకరాల (రెండు కుంటలు) భూమిని ఎలాంటి నిర్లక్ష్యం, కాలయాపన లేకుండా తక్షణమే జర్నలిస్టులకు అప్పగించాలని, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎం.పీ.జే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టేట్ పాలసీ పేరుతోనూ, సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ కావాలనే కాలయాపన చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయంగా రావాల్సిన ఇళ్ల స్థలాల అప్పగింత జరిగే వరకు ఎం.పీ.జే జర్నలిస్టుల పోరాటానికి పరోక్ష ఉద్యమ రూపంలో సంపూర్ణ మద్దతు అందిస్తుందని, స్పష్టం చేశారు.అనంతరం టి.డబ్ల్యూ.జే.ఎఫ్ (హెచ్ 2843) జిల్లా అధ్యక్షులు టి.సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ,సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపుతూ, సంవత్సరాల తరబడి ఇళ్ల స్థలాలను జాప్యం చేయడం శోచనీయమని తీవ్రంగా విమర్శించారు. ఇళ్ల స్థలాల విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా జర్నలిస్టులు, వారి కుటుంబాలు తీవ్ర మానసిక, ఆర్థిక వేదనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా టి.డబ్ల్యూ.జే.ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఎం.పీ.జే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్, జర్నలిస్టుల డిమాండ్ పూర్తిగా న్యాయమైనదని, ఇళ్ల స్థలాల మంజూరుకు ఎం.పీ.జే సంపూర్ణ మద్దతు కొనసాగుతుందని మరోసారి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టి.డబ్ల్యూ.జే.ఎఫ్ జిల్లా కోశాధికారి అర్వపల్లి నగేష్, నాయకులు కప్పల మధు, ఎం.పీ.జే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసిమ్, జిల్లా కార్యదర్శి రజబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఎంపీజే ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమాలు



- ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీజే చేపడుతున్న ఎస్.ఐ.ఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనటానికి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ మజీద్ షోయబ్ ఖమ్మం వచ్చారు. ఈ కార్యక్రమం గురించి అబ్దుల్ మజీద్ షోయబ్ మాట్లాడుతూ ఈ ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం వలన భారతదేశంలో ఓటు హక్కు కోల్పోయిన, అర్హులైన వారికి తిరిగి ఓటు హక్కు కల్పించాలని కోరారు.ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫేక్ కాసిం మాట్లాడుతూ ఈ ఎస్.ఐ.ఆర్ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ బుధవారం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) కార్యాలయంలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఎంపీజే ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేయడం చాలా పుణ్య కార్యక్రమం అని, పేదలకు బడుగు బలహీన వర్గాలకు ఎంపీజే సంస్థ చాలా మంచి కార్యక్రమలు చేయడం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని కోరినారు. మరియు మైనారిటీ గురుకుల పాఠశాల పాఠశాల మరియు కళాశాలలో 2026 27 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల గురించి మరియు ఇక్కడ అందించే వసతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసీం, జిల్లా కోశాధికారి హకీం, వైస్ ప్రెసిడెంట్ రజాబ్అలీ, సెక్రటరీ సతీష్ సంస్థ సభ్యులు రఫీ, గఫర్,హుస్సేన్ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమములలో ముఖ్య అతిథులుగా డాక్టర్ పులిపాటి ప్రసాద్ పౌర సమితి అధ్యక్షులు లింగాల రవికుమార్ బిఆర్ అంబేద్కర్ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపిజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసిమ్, జెఐహెచ్ జిల్లా అధ్యక్షులు షేక్ జైనుల్ పాషా, సేవాదళ్ అధ్యక్షులు ఎస్ డి గౌస్ ఎంపిజే జిల్లా కోశాధికారి ఎండి హాకీమ్, జిల్లా కార్యదర్శులు బొగ్గవరపు సతీష్, రజబాలి, రఫీక్, గఫార్, హుస్సేన్, అహ్మద్, నూర్ మొహమ్మద్, మూసా, అబ్దుల్ సుబూర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవ సోదర, సోదరీమణులకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన క్రీస్తు బోధనలు విశ్వ మానవాళికి ఆచరణీయమని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు దారి చూపుతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రైస్తవుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేసారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతాయని, సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని, క్రైస్తవ సోదరులు నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని, రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు కలగాలని, క్రైస్తవ సోదర, సోదరీమణులు ఆనందోత్సవాల మధ్య క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు.



# డిప్యూటీ సీఎంని కలిసిన నూతన సర్పంచ్

**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** బోనకల్ మండలం రాయన్నపేట గ్రామంలో గోవిందపురం (ఏ) నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ ఇస్రం కరుణ బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పలు సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌గా ఎన్నికైన ఆమెకు డిప్యూటీ సీఎం అభినందనలు తెలియజేస్తూ, గ్రామంలోని సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఇస్రం కరుణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భాగం నాగేశ్వరరావు, బాబు గ్రామ శాఖ అధ్యక్షులు భాగం పాపారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

# జోష్ క్రీడల్లో సత్తా చాటిన రఘునాథపాలెం మైనార్టీ పాఠశాల బాలికలు



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఇంటర్ స్కూల్ జోష్ ఛాంపియన్ ...ఈ నెల 19నుండి 20 వరకు కారేపల్లిలో జరిగిన మైనారిటీ పాఠశాలల బాలికల ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ తమ విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి జోష్3 ఛాంపియన్షిప్ గెలుచుకోవడం చాలా ఆనందంగా ఉందని మైనారిటీ ఖమ్మం గర్ల్స్ వన్ ప్రిన్సిపల్ శైలజ అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండి అనేక పాఠశాలలు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నాయన్నారు. పోటీలు చాలా ఉత్తేజకరంగా జరిగాయని ఖమ్మం గర్ల్స్1 జట్టు 8 విభాగాల్లోఅసాధారణమైన ప్రదర్శన కనబరిచి ఛాంపియన్ ట్రోఫీ గెలుచుకుందన్నారు. ప్రతి మ్యాచ్ లోను బాలికలు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ప్రేక్షకులను ఆకట్టుకున్నారన్నారు. జోష్3 ఛాంపియన్షిప్ వరుసగా మూడుసార్లు తమ పాఠశాలనే గెలుచుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పాఠశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది క్రీడాకారులను మరియు పాఠశాల పిఈటి ప్రేమరాణి ని అభినందించారు.




# ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్‌లో నూతనంగా హనుమకొండ జిల్లా బాడీ ఏర్పాటు


**హనుమకొండ,డిసెంబర్ 24 (న్యూస్):** ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్‌లో హనుమకొండ జిల్లాకు సంబంధించి నూతన జిల్లా బాడీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పదాధికారులను అధికారికంగా పరిచయం చేశారు.హనుమకొండ జిల్లా రీజినల్ ప్రెసిడెంట్‌గా డి. తారాచంద్ (ఏఈ)ను, రీజినల్ సెక్రటరీగా డి. లక్ష్మణ్ నాయక్ (ఎఫ్ఎం)ను నియమించారు. అలాగే రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఎం. లక్ష్మణ్ (ఏఈ), ఎల్. శశికాంత్ (సబ్ ఇంజనీర్) లను నియమించారు. డివిజన్ బాడీ ప్రెసిడెంట్‌గా కె. జంపన్న (ఎల్ఐఎస్ఈసీ), బి. వెంకన్న (ఏఎల్ఎం)లను నియమించగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి. శివ (ఏఎల్ఎం)ను, ట్రెజరర్‌గా వి. శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు.ఈ నూతన జిల్లా బాడీ సభ్యులను ఎస్ఈ మరియు ఇన్‌చార్జ్ డీఈ/టాచ్‌కు అసోసియేషన్ కంపెనీ ప్రెసిడెంట్ అర్జీ నాయక్, కంపెనీ సెక్రటరీ అజ్మీర శ్రీరామ్ నాయక్ అధికారికంగా పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, శాఖ అభివృద్ధి, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం నూతన జిల్లా బాడీ సమిష్టిగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రవక్తల పరంపర - సత్యానికి నిలువెత్తు సాక్ష్యం

## ఈసా (అ.స) నుండి ముహమ్మద్ (స) వరకు!






**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** మానవ చరిత్ర అనే మహా నదిలో కొన్ని జ్ఞాపకాలు తీరని దాహాన్ని తీర్చే చల్లని నీటి ధారల్లా నిలిచిపోతాయి. కాలం ఎంత వేగంగా కదిలినా, దైవం పంపిన ప్రవక్తల కాంతి మాత్రం తరతరాలకు మార్గదర్శకంగానే ఉంటుంది. ముఖ్యంగా, మర్యమ్ కుమారుడు ఈసా (అలైహిస్సలాం) మరియు అబ్రహం సంతతిలో ఉద్భవించిన ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితాలు.. పవిత్రతకు, దైవ విధేయతకు మరియు ప్రవచనాల నెరవేర్పుకు అద్దం పడతాయి.

పవిత్రతకు ప్రతిరూపం: మర్యమ్ కుమారుడు ఈసా

ప్రపంచ చరిత్ర పుటల్లో మర్యమ్ కుమారుడు ఈసా (అ.స) ఒక అద్భుత నక్షత్రం. నిశ్శబ్ద రాత్రిలో, తండ్రి లేని బిడ్డగా ఆయన జన్మించడం దైవ సంకల్పానికి ఒక గొప్ప నిదర్శనం. ఖుర్ఆన్ ఈ అద్భుత జననాన్ని ఎంతో గౌరవప్రదంగా వర్ణించింది. ఊయలలో ఉన్నప్పుడే మాట్లాడి తన తల్లి పవిత్రతను చాటిచెప్పిన ఆ పసిబాలుడు, అల్లాహ్ యొక్క 'వాక్కు' (కలిమతుల్లాహ్).

ఆయన చేతుల్లో స్వస్థత ఉంది, చూపుల్లో కారుణ్యం ఉంది. అంధులకు చూపునివ్వడం, మృతులను బ్రతికించడం వంటి అద్భుతాలు చేసినా, ఆయన ఎన్నడూ గర్వపడలేదు. "నేను అల్లాహ్ దాసుడిని" అని ప్రకటించుకుంటూ, తన శక్తి అంతా సృష్టికర్త ప్రసాదించిందేనని వినమ్రంగా చాటారు. అతిశయోక్తుల మధ్య ఆయన దైవత్వపు ముసుగులో చిక్కుకోలేదు, నిందల మకిలిలో అణగిపోలేదు. కేవలం ఒకే దేవుడిని ఆరాధించమని పిలుపునిచ్చిన గొప్ప ప్రవక్తగా ఆయన చరిత్రలో నిలిచారు.

ప్రవచనాల సంగమం: ముహమ్మద్ ప్రవక్త రాక

ఈసా (అ.స) బోధించిన అదే ఏకేశ్వరోపాసన సందేశాన్ని పరిపూర్ణం చేసేందుకు, బైబిల్ ప్రవచనాల వెలుగులో ముహమ్మద్ ప్రవక్త లోకానికి విచ్చేశారు. అబ్రహం వేసిన పునాదిపై ఇస్సాకు, ఇష్మాయేలు అనే రెండు కొమ్మలు విరిశాయి. ఇస్సాకు వంశంలో ఈసా (అ.స) వంటి ప్రవక్తలు రాగా, ఇష్మాయేలు వంశం నుండి ముహమ్మద్ అనే వెలుగు ప్రసరించింది.

ద్వితీయోపదేశకాండము (18:18) లో మోషేకు దేవుడు ఇచ్చిన వాగ్దానం—"నీ వంటి ఒక ప్రవక్తను వారి సహోదరులలో నుండి పుట్టించెదను"—ముహమ్మద్ ప్రవక్త జీవితంలో అక్షరాలా నెరవేరింది. మోషే లాగే ఆయన చట్టాన్ని తెచ్చారు, రాజనీతిజ్ఞుడిగా నిలిచారు మరియు సహజ మరణం పొందారు. అలాగే, పారాను (మక్కా) కొండల నుండి పదివేల మంది పరిశుద్ధులతో ఆ ప్రవక్త వస్తాడన్న బైబిల్ మాట (ద్వితీయోపదేశకాండము 33:2), మక్కా విజయ సమయంలో సాకారమైంది.

సత్య స్వరూపి: ఆదరణకర్త

యేసు క్రీస్తు (ఈసా) తన తర్వాత రాబోయే 'ఆదరణకర్త' గురించి ప్రస్తావిస్తూ, "ఆయన తనంతట తానుగా ఏమీ చెప్పడు, తాను విన్న వాటినే చెబుతాడు" (యోహాను 16:13) అని పలికారు. 23 ఏళ్ల పాటు దైవదూత ద్వారా వినిపించిన ఖురాన్ వాక్కులను మానవాళికి అందించిన ముహమ్మద్ ప్రవక్త జీవితం ఈ ప్రవచనానికి సజీవ సాక్ష్యం. యెషయా (28:11) సూచించిన 'అన్యభాష' (అరబిక్) ద్వారా దైవం ప్రపంచంతో మాట్లాడింది.

ముగింపు: ఒకే పిలుపు ఒకే మార్గం

ఈసా (అ.స) జీవితమంతా ఒక్కటే నినాదం వినిపిస్తుంది: "అల్లాహ్ నా ప్రభువు మరియు మీ ప్రభువు. ఆయననే ఆరాధించండి." ఆయన తనను తాను దేవుడిగా చెప్పుకోలేదు, కేవలం ఒక విధేయుడైన దాసుడిగా మిగిలారు. అదే విధంగా ముహమ్మద్ ప్రవక్త కూడా ప్రపంచాన్ని ఏకదైవారాధన వైపు నడిపించారు.

దేవుని రాజ్యం ఒక జాతి నుండి తీసివేయబడి, ఫలాలను ఇచ్చే మరొక జాతికి ఇవ్వబడుతుందన్న హెచ్చరిక (మత్తయి 21:43) చరిత్రలో ఒక గొప్ప మలుపు. ఇవన్నీ కాకతాళీయాలు కావు; ఇవి యుగయుగాలుగా దైవం మానవాళికి ఇస్తున్న సంకేతాలు. సత్యం ఎప్పుడూ సూర్యుడిలా ప్రకాశిస్తుంది. ఈ ప్రవక్తలిద్దరూ ఒకే గొలుసులోని వజ్రాల వంటివారు. వారిని ప్రేమించడం, వారి బోధనలను అనుసరించడం ద్వారానే మనం శాంతిని, పరలోక ప్రాప్తిని పొందగలం. ఆ వెలుగు మనందరి హృదయాలను తాకాలని కోరుకుందాం.

ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

# గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం..

## రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల సౌకర్యవంతమైన జీవనానికి, భవిష్యత్తుకు అనుగుణంగా కొత్త రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

డిప్యూటీ సీఎం మధిర నియోజకవర్గం బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో, ముష్టికుంట్ల నుంచి చిరునోముల వరకు రూ. 3 కోట్ల 45 లక్షల అంచనా వ్యయంతో, రాయన్నపేట గ్రామంలో, రాయన్నపేట నుంచి కలకోట వరకు రూ. 3 కోట్ల 75 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్ల పనులకు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. రోడ్ల నిర్మాణాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రహదారి నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభమవుతాయని, వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్యం వంటి రంగాలకు కొత్త ఊతం లభిస్తుందని అన్నారు.

ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల అభివృద్ధి అనే దృక్పథంతోనే ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు పోతున్నాయ్.. బకాయిలు చెల్లించండి

- రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన కమిటీ డిమాండ్




**హన్మకొండ, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని పెన్షనర్స్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఈ. నర్సింహారెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయీస్ బకాయిల సాధన కమిటీ, రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకరోజు నిరాహార దీక్షలకు పిలుపునివ్వగా,భాగంగా హన్మకొండ ఏకశిలా (జయశంకర్) పార్కు సమీపంలో నిరాహార దీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా వి. రాంమనోహర్, కందుకూరి దేవదాసు, కడారి బోగేశ్వర్, టి. పురుషోత్తం, కె. సుధీర్ బాబులు మాట్లాడుతూ, మార్చి 2024 నుంచి నవంబర్ 2025 వరకు రిటైర్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను 20 నెలలు గడిచినా విడుదల చేయకపోవడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ఈ పరిస్థితి పెన్షనర్లను మానసికంగా వేధిస్తూ, అనారోగ్యాలకు గురిచేస్తోందని అన్నారు. బకాయిల చెల్లింపుల ఆలస్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 35 మంది పెన్షనర్లు మృతిచెందినట్టు తెలిపారు. సుమారు 14 వేల మందికి 20 నెలలుగా బకాయిలు అందకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనై కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని, పెండింగ్ బకాయిలన్నింటినీ ఏకమొత్తంగా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎస్‌జీపీఏటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు టి. వీరయ్య, జి. సాంబయ్య, కె. సమ్మారెడ్డి మాట్లాడుతూ, కనీసం పీఆర్‌సీ-2020 ఎరియర్స్, జీపీఎఫ్ బిల్లులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యూటీ, కమ్యుటేషన్, సేవలో సరెండర్ చేసిన లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ నిరాహార దీక్షలో ఎండీ మహబూబ్ అలీ, ఇ. ఇంద్రసేనారెడ్డి, విశ్వనాథం, వేల్పుల రవీందర్, రఘువీర్, పి. రాజిరెడ్డి, పి. సమ్మయ్య, ఎండీ మదార్ సాహెబ్, ఎం. రాజకుమారమ్మ, పి.వి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు కోల సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, టి.పి.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు. అశోక్, డీ.టి.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ. గోవింద రావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బకాయిల సాధన కమిటీ ట్రెజరర్ సూర కుమారస్వామి, జాయింట్ సెక్రటరీలు ఎండీ అబ్దుల్ గఫార్, ఎం. దామోదర్, ఎల్. ప్రభాకర్ రెడ్డి, అశోక్ కుమార్, పి. రాజిరెడ్డి, సారయ్య, రాజేందర్, కె. శ్యామ్ రావు, జె. మహేందర్ రావు, ఎం. సంజీవరెడ్డి, మామిండ్ల మురళీతో పాటు మొత్తం 180 మంది దీక్షలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## జనగామ నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

**జనగాం,డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**



జనగామ నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవ సోదర సోదరీమణులకు ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి క్రిస్మస్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సేవాభావం, క్షమాగుణం వంటి విలువలను బోధించిన యేసు క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత ఆనందదాయకమైన పండుగగా పేర్కొన్నారు.ఈ క్రిస్మస్ పర్వదినం క్రైస్తవ సోదరులకు శుభం చేకూరాలని, కుటుంబ సమేతంగా సుఖ సంతోషాలతో వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. యేసు క్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని కోరుతూ తన సందేశాన్ని వెల్లడించారు.



## కరుణాలయానికి 50 కేజీల బియ్యం విరాళంగా అందజేసిన రిపోర్టర్ అనిల్ రాజ్

**ధర్మసాగర్,డిసెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

క్రిస్మస్ పండుగ సందర్భంగా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలోని కరుణాలయంలో అనాథ పిల్లలకు సహాయం అందించారు. రిపోర్టర్ అనిల్ రాజ్ తన తాత గొల్లపల్లి రాజయ్య, నానమ్మ వెంకటమ్మల జ్ఞాపకార్థంగా 50 కేజీల బియ్యాన్ని కరుణాలయానికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనాప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనాథ పిల్లల సంక్షేమానికి ఇటువంటి సేవలు మరింత విస్తరించాలని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో గొల్లపల్లి నారాయణ, ఎం.డి. శంషుద్దీన్, చిట్యాల రమేష్, కందుకూరి అజయ్ చందర్, కందుకూరి ప్రభాకర్, ఎం.డి. నశిరోద్దీన్, ఫా. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సేవాభావంతో ముందుకు వచ్చిన అనిల్ రాజ్‌ను పలువురు అభినందించారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా గెలిచిన వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రేవంత్‌రెడ్డిని ఏకిపారేశారు. 'సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వారికి నా పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు. ఈ గెలుపు మామూలు గెలుపు కాదు, అద్భుతమైన గెలుపు. ఓటమి భయంతో రేవంత్‌రెడ్డి కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఫలితం దక్కలేదు. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేయరు. కానీ ఓడిపోతామనే భయంతో రేవంత్‌రెడ్డి ఊరూరు తిరిగిండు. 'అందిరికీ బతుకమ్మ చీరలు ఇచ్చిన, ఆ చీరలు కట్టుకుని వచ్చి కాంగ్రెపోళ్లకు ఓటేయాలె' చిల్లర మాటలు మాట్లాడిరడు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ భంగపడిరది. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి 90 శాతం, వీలైతే 100 శాతం విజయాలు దక్కాలి. కానీ కాంగ్రెస్‌కు 64 శాతం ఫలితాలే వచ్చాయి. కాంగ్రెస్ 6 వేల సర్పంచ్ పదవులు గెలిస్తే, బీఆర్ఎస్ 4 వేల సర్పంచ్ పదవులు గెలుచుకుంది' అన్నారు. 'బీఆర్ఎస్ హయాంల 32 జిల్లా పరిషత్‌లు మనమే గెలిచినం. 10 డీసీసీబీలు, 10 డీసీఎంఎస్‌లు ఉంటే వంద శాతం మనమే గెలిచినం. సర్పంచ్ ఎన్నికల్లో 80 నుంచి 90 శాతం మనమే గెలిచినం. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా 35 నుంచి 40 శాతం బీఆర్ఎస్ సర్పంచ్‌లను గెలిపించిండ్రు ప్రజలు. కాంగ్రెసోళ్లు పైసలు పంచి, సారా పంచి, గూండాగురి చేసినా గూడా బీఆర్ఎస్ పార్టీ నుంచి 4 వేల మంది సర్పంచ్‌లుగా గెలువడం మామూలు విషయం కాదు. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లేదు సచ్చిపోయింది అంటడు. కానీ నిద్రల గూడా బీఆర్ఎస్ పార్టీ గురించే కలువరిస్తడు. బీఆర్ఎస్ పార్టీ పేరు తీయకుండా, కేసీఆర్ పేరు తీయకుండా ఎప్పుడన్న మాట్లడుతడా రేవంత్‌రెడ్డి..? మల్లమిదికెళ్లి మేకపోతు గాంభీర్యం. ఓసారి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇగ బీఆర్ఎస్ పని అయిపోయింది. ఇక నుంచి ఆ పార్టీ విత్తనం కూడా మొలకెత్తనియ్యను అని శపథం చేసిండు. కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి గుండెల నుంచి 4 వేల మంది బీఆర్ఎస్ సర్పంచులు మొలకెత్తిండ్రు' అని వ్యాఖ్యానించారు. 'నీకు దమ్ముంటే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టు. కారు గుర్తులేని సర్పంచ్ ఎన్నికల్లనే 4 వేల మంది గెలిచిండ్రు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెడితే అండ్ల కారు గుర్తు ఉంటది. కారు గుర్తు అంటే కేసీఆర్ గుర్తు. జనం కారు గుర్తు మీద ఓట్లు గుద్దిగుద్ది సంపుతరు నిన్ను ఏమనుకుంటున్నవో. కారు గుర్తు ఉండే ఎన్నికలు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుంది. ఎన్నికలంటేనే రేవంత్‌రెడ్డి గడగడ వణుకుతున్నడు' అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.





## ఎమ్మార్వోను, ఎస్సైను మర్యాదపూర్వకంగా కలిసిన శాలపల్లి సర్పంచ్, ఉపసర్పంచ్

**వేలేరు, డిసెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలంలోని శాలపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామ సమస్యలు, శాంతి భద్రతలు, పరిపాలనా అంశాలపై సంబంధిత అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ క్రమంలో గ్రామ సర్పంచ్ కూరపాటి అశోక్, ఉపసర్పంచ్ ఎర్ర గొల్ల రమేష్‌లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేష్‌ను కలిసి గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, పోలీస్-గ్రామ పాలకవర్గం మధ్య సమన్వయం అంశాలపై చర్చించారు. అదేవిధంగా వేలేరు మండల తహశీల్దారు కోమిని కూడా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి గ్రామానికి సంబంధించిన రెవెన్యూ సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ సేవల అమలు అంశాలపై వినతులు సమర్పించారు.గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తెలిపారు. ఈ భేటీలలో గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు పోతారబోయిన సతీష్, మండల కొమురయ్యలు పాల్గొన్నారు.

# మరో మైలురాయిని అందుకున్న ఇస్రో

- బాహుబలి రాకెట్ ప్రయోజం విజయవంతం
- అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామన్న ఇస్రో చైర్మన్

**హరికోట , డిసెంబర్24 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరింది. శ్రీహరికోటలో బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్`2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించింది. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా 4.జి, 5జి సేవలను బ్లూ బార్డ్ బ్లాక్`2 అందించనుంది. ఎల్‌వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగం. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. బాహుబలి ప్రయోగం విజయవంతమైందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాల్లో సంపూర్ణ విజయాలు సాధిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతం చేశామన్నారు. అమెరికన్ కస్టమర్ కోసం ప్రయోగం చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ ప్రయోగాల్లో ఇది ఒకటన్నారు. 34 దేశాలకు ఇస్రో సేవలందిస్తోందని అన్నారు. గగన్‌యాన్ కోసం ఈ ప్రయోగం మరింత ఆత్మవిశ్వాసం కలిగిస్తోందని తెలిపారు.





ఇస్రోపై అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామని ఇస్రో చైర్మన్ తెలిపారు.ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయమన్నారు. వాణిజ్య ప్రయోగాలలో మరోసారి సత్తా చాటామని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం 52 రోజుల్లోనే సిద్ధం చేసి ప్రయోగం చేపట్టామని చెప్పారు. మన శాస్త్రవేత్తల సమిష్టి విజయం.. ఎల్‌వీఎం 3 `ఎం 6 రాకెట్ ప్రయోగం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రయోగ విజయం తమకు అత్యంత ధైర్యాన్ని కల్పించిందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాలలో ఈ ప్రయోగం మూడవ వాణిజ్య ప్రయోగమని వెల్లడిరచారు. ఎల్‌వీఎం రాకెట్లనే చంద్రయాన్ 4, 5కు ఉపయోగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మానవ రహిత ప్రయోగాలని చేపట్టబోతున్నామని ప్రకటించారు. వాణిజ్య ప్రయోగ ఒప్పందాలు పూర్తయిన వెంటనే వరస వాణిజ్య ప్రయోగాలని చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో నావిగేషన్ ప్రయోగాలు, అంతరిక్షంలో స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు.

## మేడారంలో గద్దెలపై కొలువుదీరిన గిడిద్దరాజు, గోవిందరాజులు


**ములుగు , డిసెంబర్24 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా.ఈసారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది.పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్కసారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

## ఢిల్లీలో మూడు రోజులు ఉంటే.. అలర్జీలు వచ్చాయి

- ఢిల్లీలో నేను ఉండలేను..నితిన్ గడ్కరీ



దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు.'ఇది ఎలాంటి జాతీయవాదం..? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధన వినియోగాన్ని మనం తగ్గించలేమా..? సున్నా కాలుష్యానికి దారితీసే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాలను మనం ఎందుకు ప్రోత్సహించలేము..?' అని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి ఏటా రూ.22 లక్షల కోట్ల ఖర్చు అవుతోందని.. ఇది ఆర్థిక భారమని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల వైపు మళ్లాలని సూచించారు.

**ఢిల్లీలో నేను ఉండలేను..**

కాగా, ఢిల్లీ కాలుష్యంపై గడ్కరీ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది. అందుకే నేను వచ్చేటప్పుడే రిటర్న్ టికెట్స్ కూడా బుక్ చేసుకుంటాను. ప్రజలు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఢిల్లీలో కాలుష్యం కారణంగా సాధారణ ప్రజల ఆయుర్దాయం తగ్గింది. వాహనాలకు వినియోగించే శిలాజ ఇంధనాల వల్ల కలిగే కాలుష్యాన్ని తగ్గించడం ప్రజలందరి ప్రధాన బాధ్యత' అని అన్నారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896